# హంతకి

"ప్రేమించిన వస్తువులనే అంతా హత్య చేస్తూ వుంటారు.

కత్తులతో కొందరూ, ముద్దులతో కొందరూ!" అన్నాడొక ఆంగ్లకవి. ఎంత ఆలోచించినా ఈ పంక్తులలో అతను దాచిన భావమేమిటో నాకు బోధపడటం లేదు. కాని పూర్ణిమ సంగతి విన్నప్పుడు ఈ మాటల్లో అర్ధమేదో మెరుపులాగా క్షణంసేపు నా మనస్సులో మిరుమిట్లు గొలిపినట్లయింది.

న్యాయస్థానంలో నిజం చెబుతానని ప్రమాణంచేసి అసత్యం చెప్పటమే చాలా మందికి పరిపాటి అయిపోయింది. పూర్ణిమమాత్రం నిజమే చెప్పింది. ముక్తకంఠంతో కంపిత స్వరంతో, అందరూ విస్తుపోయేట్లు నిజమే నొక్కిచెప్పింది. ఆమె పక్షాన వాదించే న్యాయవాది పూర్ణిమకి మతిస్థిరం లేదనీ, ఏమి పలుకుతున్నదో తెలియనిస్థితిలో ఏదో ప్రలాపిస్తున్నదనీ ఆవాదం నమ్మడానికి వీలులేదనీ గొంతు చించుకున్నాడు. డొంక తిరుగు వాదాలతో నిజానికి మసిపూసి మారేడుకాయ చెయ్యటానికే న్యాయవాదులంతా నల్లకోట్లు తొడుక్కుంటారేమోనని బాధపడింది పూర్ణిమ.

నన్నెవ్వరూ రక్షించటానికి ప్రయత్నించవద్దు. మోసాలకి పుట్టిల్లయిన ఈ లోకంలో నేను బ్రతుకలేను నేను చెబుతున్నది అక్షరాలా నిజం. ఈశ్వరుడి కళ్ళకి కనిపించే నిజానికీ నేను చెబుతున్నదానికీ వీసంకూడా బేధంవుండదు. మోసానికి

బలి అయిపోయిన నేను మోసంతో నా ప్రాణాలు నిలబెట్టు కోటానికి ప్రయత్నించను. సర్వస్వమూ కోలుపోయిన తరవాత నేను ఈ లోకంలో ఇంక బతికి చేసేదేమిటి ? నన్ను క్షమించకండి, నన్ను కరుణించకండి. నాకు మరణశిక్ష విధించి మీ కర్తవ్యం నెరవేర్చి పుణ్యం కట్టుకోండి ?' అంటూ జడ్జినుద్దేశించి చేసిన విన్నపం వినేసరికి అందరికి వొంటిమీద తేళ్ళు జెర్రులూ పాకినట్లనిపించింది. అందాకా ఆమెమీద కలిగిన జాలి క్రోధంగా మారింది. దీనికి తగిన శాస్తి జరగాలిసిందే నని ఆవిక్కసు పుట్టుకు వచ్చింది కొందరికి.

జడ్జిగారి తీర్పుప్రకారం పూర్ణిమకి యావజ్జీవ శిక్ష పడింది. స్త్రీ కాబట్టి ఉరిశిక్ష వెయ్యటం లేదని న్యాయమూర్తి దాక్షిణ్యం వెల్లడించాడు.

ఈ తీర్పువిని కొంచెంకూడా చలించలేదు. వీసంకూడా విచారించలేదు. లేశంకూడా ఆశ్చర్యపడలేదు. తను చేసిన పనికి యెంత దారుణమైన శిక్ష యెదురవుతుందో పూర్ణిమకి మొదటినుంచీ తెలుసు. దుడుకుతనంతో ఒక పనిచేసి దాని ఫలితాలు నెత్తినపడకుండా తప్పించుకోవాలని పెనుగులాడే పిరికితనం ఆమెలో యెక్కడా కనిపించదు. అటువంటి వుద్దేశం వుంటే తనంతట తానువచ్చి పోలీసులచేతుల్లో ఎందుకు చిక్కుకుంటుంది ? శిక్షకోసం బాధపడటం లేదు. కాని తన భర్త ఎవరూ అర్థించకుండావచ్చి తన తరఫున కోర్టులో వాదించినందుకు మాత్రం ఎంతో బాధపడుతుంది. న్యాయవాది ధర్మం ప్రకారంవచ్చి చివరి క్షణందాకా తనను రక్షించాలని ఎంతో పెనగులాడారు. తను అతనకేమి ఇవ్వగలదు ? దేనికోసం

అతడా తన తరఫున నిలబడటానికి వచ్చాడు ? అసలు తను అతనికి ఏం ఇచ్చింది ? ఇద్దరు పిల్లలు...ఆరేళ్ళు మనస్సులేని కాపురం ! ఆఖరికి చెప్పకుండా అర్థరాత్రివేళ పిల్లల్నికూడా వదిలేసి, గతాన్ని మాసినచీరలాగా మూలగిరాటువేసి, నలుగురిలో అతడు నవ్వుల పాలయ్యేట్లుచేసి పారిపోయింది. అంత ద్రోహం చేసిన తనమీద ఇంత అభిమానం దేనికో ? అతని ముఖం చూస్తుంటే తన తల నరికి వేసినట్లనిపించింది. లోకంలో ఇల్లాంటి మనుషులుంటారా అనిపించింది.

కాని మూడేళ్ళకిందట, ఆ చీకటిరాత్రి...మబ్బుల కెరటాలు చుక్కల ముగ్గులని మాయం చేసినరాత్రి...పెనుగాలికి చెట్లన్నీ వూగిమూల్గినరాత్రి...ఏమైనది తను ? భర్త తనకొక పీడ కలగా కనిపించాడు. బతుకొక దారీ తెన్నూ లేని ఇసుక ఎడారిగా తోచింది. తీరని దాహంతో హృదయం వెయ్యి నాలుకలు జ్వాలల్లాగా జాపింది. దూరాన మిల మిలలాడే మరీచికకోసం తను కట్లు తెంచుకున్న క్రూరజంతువులాగా పరుగులు తీసింది.

తన కోసమే యుగయుగాలనుంచీ కాచుకుకూచున్నాడు సత్యం ! జగాల కొసలదాకా తనని ప్రేమవిహంగపు బంగరు రెక్కలమీద తేల్చుకుపోతాడని ఆశపడింది. ఆ వుంగరాల క్రాపు...ఆ విశాలమైన కళ్లు...తను కలకాలం తలదాచుకోవాలనుకున్న విస్తారమైన ఛాతీ, కండలుతేరిన చేతులూ... ఈలలు, నవ్వులు, పాటలు! ఉక్కిపోయే చీకటి గదిలోంచి ఒక్కసారిగా సాగరతీరంలోకి వచ్చిపడినట్లనిపించింది. తను

లైలా అతను మజ్నూ! తను షరీన్ అతను ఫరాద్! వాళ్ళు భగ్నప్రేమికులు. తాముకాలానికి కళ్ళెం వేసి లోకాన్ని పరిహసించి భవిష్యత్తును పరిపాలించే అనంత ప్రేమికులు, భర్తా పిల్లలూ భూతకాలంలోని భూతాలని బైటకి రాకుండా హృదయపు గుహలోకి నెట్టి దాని ద్వారానికి మరుపు అనే రాయి అడ్డుగా పెట్టింది. తమ కోసమే వెన్నెలరాత్రులూ విరిసే పారిజాతాలూ, జాజిపూల గుబాళింపులు తమకోసమే లోకం ఆనందనందనవనమై ద్వారాలు బార్లగా తెరచిరమ్మని పిలిచింది. తమ ప్రేమ గూటిలో పక్షిలాగా కాకుండా ఎల్లప్పుడూ ఆకాశంలో రెక్కలల్లార్చుస్తూ ఎగసిపోవాలని...తను ఆనందం నిత్యనూతనంగా మెరసిపోవాలని...ఎన్నెన్ని సుందర ప్రదేశాలు చుట్టివచ్చారో! హిమాలయాల తళ తళా, ముంతాజ్ చలువవెన్నెలనపూర్వ కాశ్మీరోద్యాన కుసుమాల పలకరింపూ, బృందావన సురభిళాల గిలిగింతా తమ ప్రేమ గానంలో మధుర స్వరాలు కరిగిపోయినయ్. పూర్ణిమవంటి మీద ఆభరణాలన్నీ కరిగిపోయినయ్.

"నీకు నీవారు లేరు నాకు నావారు లేరు"

అని పాడుకుంటూ సముద్రతీరంలో ఇద్దరూ ఇసుకతో పిచ్చికగూళ్ళుకట్టి పైకి సాగివచ్చే అలవాటును కూల్చివేస్తుంటే ఇంకొంచెం వెనక్కిజరిగేవాళ్ళు "మనం కట్టే ప్రేమసౌధాని కాల ప్రవాహం ఇల్లా కూల్చివేస్తే నేను సహించలేను!" అంటుంది. "మన ప్రేమ అజరామం!" అంటాడు సత్యం ఆకాలంలో మోసంలోనే ఎంత అమృతం చిందేదో!

చివరికి ఏంజరిగిందో తెలుసుకుంటే ఇదంతా కలా, నిజమా అనిపిస్తుంది... ఒక హోటల్లో బస చేస్తున్నారు. ఖాళీ చేస్తే పాత బాకీ చెల్లించాలనే భయంతో ఆగదినే అంటిపెట్టుకున్నారు. పదిరోజుల అద్దెబాకీ సత్యం ఏదో ఉద్యోగం చూస్తున్నానని పగలంతా ఎక్కడో తిరిగేవాడు. చిన్నబుచ్చుకున్న ముఖంతో సాయంత్రం ఇంటికి వచ్చాడు. భోజనం కూడా చెయ్యకుండా నిద్రపోయాడు. తనూ అల్లాగే మెదలకుండా మంచినీళ్ళు తాగిపడుకుంది. తెల్లారి లేచి చూసే సరికి తల తిరిగిపోయింది. అరికాళ్ళకింద నేల అణగారి పోతున్నట్లనిపించింది. సత్యం తనని నడిసముద్రంలో దిక్కులేని నావలాగ వదిలి మటుమాయమై పోయాడు.

గత జీవిత చిహ్నంగావున్న మంగళసూత్రం ఒక్కటే మిగిలింది. అది కూడా అమ్మివేసి హోటలు బాకీ తీర్చి శూన్యలోకంలోకి ఏకాకిగా బయలు దేరింది పూర్ణిమ.

కాళ్లు అరిగి పోయేటట్లు ఊరులన్నీ సత్యంకోసం గాలించింది. తన కలలన్ని కూల్చి తన జీవితాన్ని కాల్చి తనని నడిసముద్రంలో విడిచి వెళ్ళిన సత్యం ఎక్కడవున్నా పట్టుకుని తీరాలనే వ్రజసంకల్పంతో, బడలికనీ, ఆకలిని లెక్కచెయ్యకుండా తిరుగుతోంది. భర్త దగ్గరకి తిరిగి వెళ్ళాలనే ఆలోచనే లేదు. పిల్లలు తనని యెంత మరిచిపోతే అంత మంచిదనిపించింది. జీవితంలో వెనక్కి వెళ్ళటానికి యెవరికి సాధ్యమవుతుంది? బతుకంతా ముందుకే ఇంకా ముందుకే నడుస్తుంది. వెనక తలుపులు మూసుకు పోతయ్.

కథా నిలయం
6020
శ్రీకాకుళం

పూర్ణిమ నిరాశతో ప్లాట్ ఫారమ్మీద నిలబడి వుంది. రైలు కదలబోతోంది. కులుకులతో తళుకులతో మిడిసిపడే విలాసవతి బాబ్ హెయిర్ క్రాపు పెదిమలకి లిప్ స్టిక్... ఫస్టుక్లాసులో యెక్కింది. వెనకాల వులెన్ సూటు, అమెరికన్ ష్టైల్ నల్లకళ్ళజోడుతో యెక్కబోతున్నాడొక యువకుడు చేతిలో లెదర్ సూట్ కేసు! రంగులు మార్చిన వూసరవెల్లి!

అనుమానం లేదు. అతనే! అతనే! సుడిగాలిలాగా వచ్చి సర్పంవలె కాళ్ళకిచుట్టుకుంది. "ఫో! ఫో!" అని విదిలించేశాడు సత్యం.

"మరచి పోయావా? నన్ను అన్యాయం చేస్తావా? నేను నీకేం అపకారం చేశాను? నీకోసం సర్వస్వం అర్పించాను కదా? నడి సముద్రంలో దిగవిడుస్తావా?" అని హృదయ విదారకంగా ఆక్రోశించింది.

"ఫో ముష్టిముండా! నువ్వెవ్వరవో నేనెరుగను..." అని జేబులోంచి ఒక అణా తీసి ధర్మముగా గిరాటు వేసి లోపలికి యెక్కబోతున్నాడు.

షై గట్టిగా పట్టుకుంది పూర్ణిమ.

గార్డు ఈలవేశాడు. సత్యం ఒక్క విదిలింపు విదిలించే సరికి పూర్ణిమ కిందపడ్డది. పెదిమకి పన్ను కరుచుకొని రక్తం చిమ్మింది. జుట్టంతా చెదిరిపోయి ముఖాన్ని కమ్మింది. శివ శక్తిలాగా లేచింది. ఆకలి గొన్న ఆడపులి లాగా యెర్రటి కళ్ళతో ముందుకిదూకింది, తన్నిన త్రాచులా పడగ యెత్తింది.

రైలు కదలబోతోంది, లోపలికి యెక్కింది పూర్ణిమ.

విలాసిని చాకుతో బత్తాయిపండు తోలుతీస్తూ "గెట్

పుట్" అని కేక పెట్టినది. ఆ చేతిలోని చాకు మెరుపు లాగా లాక్కొని పైగట్టిగా పట్టుకొని "నేనెవరినో యెరగవా?" అని ఆవేశంతో గుండెలలో గుచ్చింది.

విలాసిని గొలుసు లాగింది. కదిలే బండి తక్కున ఆగింది. కేకలు జనం పోలీసులు "నేనే నేనే" అని తనే లొంగిపోయింది.

తనకే ఆశ్చర్యంగా వుంటుంది. చీమనికూడా చంపలేని తనకి అంత వొళ్లు తెలియని ఆవేశం యెలా వచ్చిందో క్షణంలో అంతటి ఘోరాన్ని తానెల్లా చెయ్యగలిగిందో! తను ప్రాణంలో ప్రాణంగా ప్రేమించిన సత్యం అంత ఘోరశత్రువుగా యెందుకు ఆ క్షణంలో కనిపించాడో!

అంతా సుడిగుండంలాగా గిరగిర తిరిగిపోతోంది. జీవితం చేతికందని ఎండమావిలాగా పరిగెత్తిపోతోంది. ఇక తను మరణించిన వాళ్ళలో లెక్కపడిపోతోంది. తనని మోసంతో సత్యమే హత్యచేశాడు. ఈ సంగతి యెవరూ గుర్తించరు. సత్యాన్ని హత్యచేసింది తను కాదు. తన భూతం! అవును. అంతకుముందే తను మరణించింది.

ద్వీపాంతరవాసానికి వెళ్ళేముందు భర్త వచ్చి "పిల్లల్ని చూస్తావా? తీసుకొచ్చాను" అన్నాడు. కంఠంలో ఎంత సానుభూతి!

"నన్నేం చూస్తారు! నేను ఎప్పుడో చచ్చిపోయాను. నన్ను యెంత త్వరగా మరిచిపోతే అంత మంచిది?" అని ముఖం తిప్పుకుంది పూర్ణిమ. వెళ్ళేటప్పుడు భర్తకళ్ళలో మెరిసిన ఒక్క అశ్రుబిందువు విషదగ్ధమైన ఆమె శిథిల హృద

యానికి అమృత సింధువుగా తోచింది. మంచి చెడుగులు పడుగు పేకలుగా చేసిన ఈ జీవితం ఆశ్చర్యంగా కనిపించింది. వెళ్ళిపోయే భర్తరూపాన్ని కడసారిచూసి కళ్లు మూసుకుంది. పూర్ణిమ, తను జీవితసాగర భీకరతరంగాలు ఒడ్డుకి విసిరివేసిన నత్తగుల్ల, తను హంతకి, తను ఇక మరణంకోసం యెదురు చూసే ప్రాణంవున్న శవం! తను...భర్త.. సత్యం... తెలుపు నలుపు గళ్ళలో తమని మూగ పావులుగాచేసి యెవరో ఆడిన అర్థంకాని చదరంగం జీవితం అనిపించింది. తనని హంతకి అంటారేకాని తన ప్రణయహృదయంలో జ్వలించిన పరాభవం యెవరు గుర్తిస్తారు.

“ఆదర్శంగా తీర్చిదిద్దాలి” అని వెల్లివిరిసే ఉత్సాహంతో పలికింది రోహిణి.

“మంచిపని ప్రారంభించడానికి ఎప్పుడైనా మంచి ముహూర్తమే!” అని జనార్ధనం బదులుచెప్పాడు.

“అల్లాకాదు. మీరు జ్యోతిష చక్రవర్తులని విన్నాను. నా సంకల్ప బలానికి గ్రహబలం కూడా తోడుకావాలి”

“ఇప్పుడు నేను వాటిజోలికి పోవటంలేదు. ఆ గ్రంథాలన్నీ అటకమీదకి ఎక్కించి చాలా రోజులైంది, ఇక బతికున్నంతకాలం వాటిని తెరవకూడదని వొట్టువేసుకున్నాను. మీకు ఎప్పుడు వీలుగా వుంటే అప్పుడు బడి ప్రారంభించండి. మా సావిడి ఖాళీగా వుంది. అక్కడే మీ పాఠశాల స్థాపించుకుంటే నాకేమీ అభ్యంతరంలేదు.

"మెనీథాంక్సు, ఇంట్లో ఎవరూ లేరామేం?" అని చారెడేసి కళ్ళని నలుమూలలకీ పరుగెత్తిస్తూ అడిగింది రోహిణి–

తన స్వయంపాక నైపుణ్యాన్ని జనార్దనం వివరించగానే ఇల్లంతా కాంతితరంగాలు కదిలేట్లుగా గలగలా నవ్వింది రోహిణి – ఎన్నాళ్ళనుంచో పాడుపడిన చీకటికొంపలోకి కప్పు సందులోంచి సూర్యకిరణం తొంగిచూసినట్లు నిద్రపోతున్న ధూళికణాలు మేలుకొని పరవశలాస్యం సాగించినట్లు అనిపిస్తోంది–

రోహిణి స్థాపించిన పాఠశాల పసిపాపల నవ్వుతో, కాకిగోలతో మోగిపోయింది. అందరికంటే పెద్ద విద్యార్థి జనార్దనం, అతనిహృదయం రోహిణి సన్నిధానంలో ఎన్నో క్రొత్తపాఠాలు నేర్చుకుని కళ్ళు తెరిచింది.

తల్లి తిరిగిరావటం లేదు – జవాబుకూడా లేదు – రోహిణి తనయింట్లోనే వుంటున్నది – తను చెయ్యి కాల్చుకోవలసిన ఆపద తప్పిపోయింది – దినం క్షణంగా వెలుతురులో తేలే తూనీగలాగా దూసుకుపోతోంది. లోకం కోడిమై ఏమిటో కూస్తోంది.

# 3

'ఇంకెన్నాళ్లు చెప్పండి ? మీ అమ్మగారు ఎంతకీ తిరిగి వచ్చేట్లు కనిపించలేదు.' అని విసుగుతో బరువుతో నిట్టూర్చింది—

'నా ఉద్దేశం ఇదివరకే చెప్పాను. నా నిశ్చయం మారదు. నా సంకల్పం సడలదు' అని జనార్దనం బైటికి పోబోయాడు. చివాలున అతనికాళ్ళమీద వాలింది రోహిణి. చెదిరిపోయిన నల్లటిజుట్టు అతనిపాదాలమీద అలల్లాగా అలుముకున్నది.

'నాకు మహోపకారం చేసినవారవుతారు. నన్ను ఘోరవిపత్తునుంచి కాపాడిన ఆప్తబంధువౌతారు. దీనంగా వేడుకుంటున్నాను. మీరు కాదంటే నాకు మరణమే శరణ్యం' అని తల అతనిపాదాలకేసి అదుముకుంటూ విశ్వాసాలతో, అశ్రువులతో చెప్పింది.

తెలియకుండానే జనార్దనం పెదిమలు కదిలినయ్ అభయహస్తముద్రతో రోహిణి తల నిమిరాడు. పరంజా గూటిలోంచి అదే సమయానికి గుక్కగూబకూసింది. రోహిణికి రానున్న ఆపదేమిటో, తను వివాహం చేసుకోటంవల్ల ఆపద ఎల్లా తప్పుతుందో ఏమీ అడగ బుద్ధిపుట్టలేదు. కాలుజారే సమయానికి తనాయించి నిలబడినా లాభంలేదు. కసాయివాడి చేతికిచిక్కిన మేకపిల్ల అమాయకంగా వాడిచేతిలోని పచ్చిక మేస్తుంది. రెండోచేతిలో దాగిన కరకుకత్తి పదును దానికేం తెలుసు ?

ఏదో మైకంలో సరే అనేశాడు జనార్దనం — రోహిణి మీద ప్రేమతో కాదు. ఆ దీనురాలిని ఆపదలోంచి రక్షిద్దామనే ఆశతో కాదంటే రోజూలాగే మూర్ఛపడిపోతుందేమోననే భయంతో — గంటలకొద్దీ తన్నుకుంటేకాని తెలివిరాదు. మూలుగూ, నోటివెంట నురుగూ తలుచుకుంటే వాళ్ళు గగు

రొప్పేడుస్తుంది. నరాలు తునకలై ఎముకలు ముక్కలైపోత యేమో ననిపిస్తుంది. డాక్టర్ హిస్టీరియా అని చెప్పాడు. యేర్పాటు ప్రకారం చిన్న తిరుపతికొండకి వెళ్ళారు - మేళం ఉచ్ఛస్వరంలో మంగళ రాగాలాపన చేస్తున్నది. రోహిణి ముఖాన కల్యాణ రేఖ అరుణకాంతి విరజిమ్ముతోంది-జనార్దనం హృదయం మృదంగంలో కలిసి మోగుతోంది. వణుకుతున్న వేళ్ళతో సూత్రం ముడివేస్తున్నాడు.

కారు ఆగిన చప్పుడైంది. 'ఆగు...నన్నే మోసం చేద్దామనుకున్నావా?' అనే కంఠం ప్రళయ మేఘంలాగా గర్జించింది. ఉలెన్ పాంటూ, సిల్కు బుష్ కోటూ! యీవినింగ్ హాటూ, సన్నటిమీసం, ఎర్రటికళ్ళూ తూలుతూ ముందుకి సాగాడు. రోహిణి మెళ్ళో పచ్చటిసూత్రం చూడగానే రెచ్చి పోయి పిచ్చివాడిలాగా చిందులుతొక్కి జేబులోంచి రివాల్వరు తీసి 'ఢాం' అని పేల్చాడు. పీటమీద రోహిణి హాహాకారంతో ఒరిగిపోయి రక్తప్రవాహంగా మారిపోయింది.

జనార్దనం ఎగిరిదూకి ఆ యువకుడి చేతిలోంచి రివా ల్వరు లాక్కుని అవతలపారేశాడు. కేకలువిని జనంవచ్చి అతన్ని చుట్టేసి పెడరెక్కలు విరిచి కట్టేశారు. 'నాకేం భయం లేదు. నేను అన్నిటికీ సిద్ధమే!' అని కేకపెట్టాడు. నోరుతెరిస్తే విస్కీ కంపు గుప్పుమంటున్నది. ఏమిటేమిటో పేలుతున్నాను- తను రోహిణి మేనత్తకొడుకట. మేనమామ చిన్నప్పుడే తనకు రోహిణినిచ్చి పెళ్ళిచేస్తానని వాగ్దానం చేశాడుట. తను చదువుకోసము అమెరికా వెళ్ళాడుట. తిరిగి వచ్చేసరికి మేన మామ చనిపోయాడుట. తనని తప్పించుకోవాలని ఎవరికీ చెప్ప

కూడా రోహిణి పారిపోయిందిట–అమెరికానుంచి తనువచ్చాక రోహిణికోసం దేశమంతా అదేపనిగా గాలిస్తున్నాడుట. కూపీ తీసి చివరికి రోహిణి బడినడుపుతున్న పల్లెటూరు వెళ్ళాడుట. అక్కడినించి ఎకాయెకీ యిక్కడికివచ్చి తనకి జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక రివాల్వరు తీశాడుట. కిందపడివున్న రివాల్వరుతో ఆ దుర్మార్గుడి వొళ్ళు తూట్లుపడేట్టు కొట్టాలని పించింది జనార్దనానికి. కాని తమాయించుకున్నాడు. ఇప్పుడు బోధపడింది రోహిణికి హిస్టీరియా ఎందుకు వచ్చిందో – యే ఆపదనుంచి తప్పుకోటంకోసం నోరు తెరిచి తనను దీనంగా వివాహం చేసుకోమని కోరిందో ఇప్పుడు తెలిసింది.

కళ్యాణవేదిక మృత్యుమందిరంగా మారిపోయింది. హోమాగ్ని వెలిగించిన చేత్తోనే చితిమంటలు రగిలించవలసి వచ్చింది.

జీవచ్ఛవంలాగా ఇంటికి తిరిగివచ్చాడు. రోహిణిలేని లోకం దీపశిఖలేని మట్టిప్రమిదలాగా బావురుమంటున్నది. బడి, పిల్లలూ, వంకెలమీద చీరలూ, జాకెట్లూ అన్నీ రోహిణి అతనికి మిగిల్చిపోయిన స్మృతిచిహ్నాలుగా మెరుస్తున్నయ్...

'టెలిగ్రాం, సార్ !' అనే కేకవిని ఉలికిపడి బైటికి వచ్చాడు జనార్దనం. కాళ్లు వణికిపోయినయ్. కళ్లు గిర్రున తిరిగిపోయినయ్. శాస్త్రుల్లుగారు పంపిన తంతి. తిరిగివస్తుంటే పట్టాలుతప్పి రైలు బోల్తాకొట్టిందిట, శాస్త్రుల్లుగారుమటుకు చిన్న దెబ్బలతో బైటపడ్డాడుట. పెట్టెలోవున్న మిగతా యాత్రీకులంతా అక్కడే మరణించారుట. జనార్దనం తల్లికూడ ఆకస్మిక మరణానికి గురి అయిందిట.

మరిపోయి రాతిబొమ్మలాగా జనార్దనం నిలబడి పోయాడు. తను ఎంత వద్దనుకున్నా వివాహం జరిగింది. తొలి క్షణంలోనే విషాదాంతం అయిపోయింది. తల్లిని యాత్రలకి ప్రోత్సాహంచేసి పంపాడు. దూరం అయితే ప్రమాదము తప్పు తుందని ఆశపడ్డాడు. తను బలవంతం చెయ్యకపోతే తల్లివెళ్ళక పోయేదికదూ ? రైలు ప్రమాదంలో బలవన్మరణానికి గురి కాకుండా ఇంటిదగ్గర క్షేమంగా వుండేదికదూ ?

తీరంలో ఇసుకతో పిచ్చుకగూళ్లు కట్టుకునే అమాయక శిశువులుగా మానవులంతా కనిపించారు. ఏక్షణంలో ఏకెరటం లేచి అన్నిటినీ తుడిచివేసి ఎందుకు నురుగుల నవ్వులు చిమ్మ తుందో ఎవరికితెలుసు? ఏదోఅర్థంకాని నాటకాన్ని చూస్తున్న ప్రేక్షకుడిలాగా జనార్దనం అక్కడే కూలబడిపోయాడు.మానవ సంకల్పాన్ని చిత్తుచేసే కనబడని క్రూరశక్తి వుందా అనేప్రశ్న మనస్సులో సుడి తిరుగుతోంది.

— —